క్లుప్తంగా

తుప్పల తొలగింపు


తుప్పలు తొలగిస్తున్న సిబ్బంది

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులోని ఉప్పువారి సత్రం వద్ద ఉన్న టిడ్కో గృహ సముదాయంలో తుప్పలను తొలగించే ప్రక్రియను శనివారం ప్రారంభించారు. టిడ్కో గృహ సముదాయంలో తుప్పలు పెరిగిపోవడం వల్ల విష సర్పాలు వస్తున్నాయని మహిళలు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య దృష్టికి తీసుకువెళ్లిన విషయం విదితమే. అదే విధంగా టిడ్కో సమస్యలను ఆ ప్రాంత మహిళలు ఎమ్మెల్యే నిమ్మకాయల రాజప్ప దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో తుప్పలను తొలగించే కార్యక్రమం ప్రారంభించారు. అదే విధంగా వీధిలైట్లు, తాగునీటి సమస్యలను కూడా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలరు బలుసు వాసు తదితరులు పాల్గొన్నారు.

ఉండూరు సొసైటీ అధ్యక్షుడు జెమ్మీ ప్రమాణ స్వీకారం


ఉండూరు సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణమూర్తి, డైరెక్టర్లు

సామర్లకోట: ఉండూరు ప్రాథమిక సహకార సంఘ అధ్యక్షుడిగా బత్సల వెంకట రమణ మూర్తి (జెమ్మీ) శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ డైరెక్టర్లుగా వీవీ సత్యనారాయణ, మేడిద సుజాత ఎంపిక అయ్యారు. వీరిని సామర్లకోట ప్రభుత్వ హైస్కూల్ పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షుడు కొప్పిరెడ్డి సత్యనారాయణమూర్తి, నీటి సంఘ డైరెక్టరు కొప్పిరెడ్డి వీరాస్వామి అభినందించారు. రైతులకు సకాలంలో స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు అందజేయడానికి తన వంతు కృషి చేస్తానని వెంకటరమణమూర్తి తెలిపారు.

ఆశా వర్కర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన మండల ఆశావర్కర్ల కార్యవర్గం

కొత్తపల్లి: స్థానిక ముప్పారపు అచ్చియ్యమ్మ కల్యాణ మండపంలో శనివారం మండల ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఆశావర్కర్స్ యూనియన్ కార్యదర్శి సీహెచ్ పద్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆశావర్కర్ల సమస్యలపై చర్చించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా ఎం.ఆశాజ్యోతి, కార్యదర్శిగా ఎం.లక్ష్మి, కోశాధికారిగా ఆర్.రత్నం, సభ్యులుగా ఎస్.బోగమ్మ, ఈగల పద్మావతి, జి.మంగారత్నం, డి.సువర్ణ, కే.పాపారత్నం, జి.రజని, పి.కాశీరత్నం, ఎం.జయలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కె.నాగేశ్వరావు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి జి.అప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ రోగులకు హెపటైటిస్ టీకా


పెద్దాపురం ఆసుపత్రిలో వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి

పెద్దాపురం: స్థానిక ఏరియా ఆసుపత్రి పరిధిలో సుమారు 300 మంది హెచ్ఐవీ రోగులకు హెపటైటిస్ టీకా వేసినట్టు పెద్దాపురం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమామహేశ్వరి, జిల్లా ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఐ.ప్రభాకర్ తెలిపారు. శనివారం ఐసీటీసీలో ఆయా రోగులకు వేసే టీకా కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్లు ఉమామహేశ్వరి, ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పటివరకు హెచ్ఐవీ బాధితులకు మందులు పంపిణీ చేశారన్నారు. ఇక నుంచి బాధితులకు ప్రమాదం లేకుండా హెపటైటిస్ బీ, హెపటైటిస్ సీ, వ్యాక్సిన్ వేయింన్నారు. ఎవరైనా హెచ్ఐవీ బాధితులు ఉంటే ఆసుపత్రిలోని ఐసీటీసీ విభాగంలో టీకాలు వేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రత్నమణి, సీపీఎం బాలాజీ, డీసీ బుజ్జిబాబు, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, చంద్రమౌళి, జ్యోతి, ఎల్‌టీ శ్రీనుబాబు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బురదమయం


దమ్ము పొలాన్ని తలపించేలా ఉన్న పంచారామ క్షేత్రం నుంచి రైతుల పొలాలకు వెళ్లే రోడ్డు

- భీమేశ్వరస్వామి ఆలయం సమీపంలో పొలాలకు వెళ్లే రోడ్డు అధ్వానం
- భారీ వాహనాల రాక పోకలతో రోడ్డు ధ్వంసం
- ఇబ్బంది పడుతున్న రైతులు, భక్తులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఉన్న రైతులు పొలాలకు వెళ్లు రోడ్డు బురదమయంగా మారింది. పంచారామ క్షేత్ర ముఖద్వారం నుంచి రాయిచెట్టు రోడ్డు పొలానికి వెళ్లు రోడ్డు, పంచారామ క్షేత్రం నుంచి భీమవరం రైతులకు చెందిన రోడ్డు, మాండవ్యనారాయణస్వామి ఆలయం నుంచి పంచారామ క్షేత్రం, మాండవ్యనారాయణస్వామి ఆలయం నుంచి జగ్గమ్మగారిపేట పొలాలకు వచ్చే రోడ్డు దమ్ము పొలాలను మరిపిస్తున్నాయి.

భారీ వాహనాల రాకపోకలతో..

పంచారామ క్షేత్రం సమీపంలో నుంచి 216 జాతీయ రహదారిని నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి మెటీరియల్ తీసుకు వెళ్లడానికి భారీ వాహనాలు ప్రతి రోజు వందల సంఖ్యలో తిరుగూ ఉండడంతో రోడ్లు ధ్వంసమయ్యాయి. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మరింతగా పాడై రోడ్లు బురదమయంగా మారాయి. ఆ రోడ్ల మీదుగానే టిప్పర్లు రాకపోకలు సాగిస్తుండడంతో సైకిళ్లు, మోటారుసైకిళ్లపై పొలాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ప్రతి రోజు అనేక మంది రైతులు పొలాల నుంచి పచ్చగడ్డి కోసుకొని మోటారుసైకిళ్లు, సైకిళ్లపై ఇళ్లకు తీసుకువెళుతుంటారు. అయితే ఈ రోడ్లు దమ్ము పొలాలను మరిపించడంతో ద్విచక్ర వాహనాలు జారిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భక్తుల ఇబ్బంది

పట్టణానికి చెందిన అనేక మంది భక్తులు కాలిబాట వంతెన మీదుగా మాండవ్యనారాయణస్వామి ఆలయం వద్ద రోడ్డు నుంచి పంచారామ క్షేత్రానికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో పంచారామ క్షేత్రానికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రోడ్డు బురదమయంగా మారడంతో భక్తులకు ఇబ్బంది పడుతున్నారు. వారికి ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా రోడ్డుపై క్రషర్ బూడిద వేయించాలని కోరుతున్నారు.

మూడు కిలోమీటర్లు నడవాల్సిందే..

తమ పొలాలకు వెళ్లడానికి తమ వాహనాలను పంచారామ క్షేత్రం వద్ద పార్కింగ్ చేసి సుమారు మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వస్తోందని రైతులు నేతల హరి బాబు, వల్లూరి వెంకటరమణ, చలికి వెంకట్రావు, వల్లూరి కల్యాణ్, చలికి రాజు, బిక్కిన చిన్నాలు వాపోతున్నారు. వర్షాలు తగ్గే వరకు ఆయా రోడ్లలో వాహనాలు నిలుపుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ధ్వంసమైన రోడ్లను కాంట్రాక్టరుచే వెంటనే నిర్మాణం చేయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మొక్కుబడికి మోక్షం కల్పించడానికి చర్యలు

సాక్షి ఇంపాక్ట్


ప్రధానోపాధ్యాయుడి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎంఈఓలు

పిఠాపురం: పాఠశాలలో 90 మంది పిల్లలకు నలుగురే ఉపాధ్యాయులు ఉండి విద్యా బోధనకు ఇబ్బందిగా మారిన బడికి తగిన సిబ్బందిని నియమించి బోధనా సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు విద్యాశాధికారులు తెలిపారు. పిఠాపురం మండలం బి.కొత్తూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 90 మంది విద్యార్థులు ఉండగా కేవలం నలుగురే ఉపాధ్యాయులు ఉండడంతో విద్యాబోధన కుంటుపడిన వైనంపై సాక్షి దినపత్రికలో శనివారం 'మొక్కుబడి చదువులు' అనే శీర్షికన వెలువడిన కథనానికి విద్యా శాఖాధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పిఠాపురం విద్యా శాఖాధికారులు ఎం.శ్యాంబాబు, కేటీ నారాయణ శనివారం పాఠశాలను సందర్శించారు. అక్కడి సమస్యలను ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యా కమిటీ చైర్మన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా తగిన విధంగా ఉపాధ్యాయులు లేక కొన్ని సబ్జెక్టులు చెప్పలేని పరిస్థితి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు చెప్పారు. స్కూల్‌కు కాంపౌండ్ వాల్ లేక పిల్లలు ప్రమాదాలకు గురవుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో సమస్యలన్నిటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల కొరతను నివారించేలా డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను నియమించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు తెలిపారు.

జగ్గయ్య చెరువు కాలనీలో రేషన్ షాపుల ఏర్పాటు

ఎట్టకేలకు పిఠాపురం పట్టణం జగ్గయ్య చెరువు కాలనీలో 20, 21, 22 వార్డులకు సంబంధించి రెండు రేషన్ దుకాణాలను శనివారం ఏర్పాటు చేశారు. వీటిని పిఠాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా ఈ కాలనీలో రేషన్ షాపులు స్థానికులు లేక కిలోమీటర్ల మేరా వెళ్లి రేషన్ తెచ్చుకునే వారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొనేవారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ వాహనాల ద్వారా లబ్ధిదారుల ఇళ్లకే రేషన్ అందించడంతో ఐదేళ్లు ఆ ఇబ్బందులు తప్పాయి. కాని మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాకా రేషన్ వాహనాలను రద్దు చేయడంతో ప్రజలకు మళ్లీ రేషన్ కష్టాలు మొదలయ్యాయి. దీంతో స్థానికులు పడుతున్న వేదనపై గత నెల జూన్ ఒకటో తేదీన జనం పరేషన్, అనే శీర్షికన సాక్షి దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి జూన్ రెండో తేదీన స్పందించిన అధికారులు రేషన్ దుకాణాల ఏర్పాటుకు అన్ని పూర్తి చేసి చివరకు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు కౌన్సిలర్ కావాడా పోశయ్య బండి రవి జనసేన నాయకులు గాది కోటేశ్వరరావు జిలకర దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ విద్యుత్ స్తంభం ఏర్పాటు


సిమెంట్ స్తంభం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

పిఠాపురం: స్థానిక జగ్గయ్య చెరువు కాలనీలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ వైర్లు వేలాడకుండా ఉండడానికి ఏర్పాటు చేసిన కర్ర స్తంభాన్ని విద్యుత్ శాఖాధికారులు మార్పు చేశారు. విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మరి భయభ్రాంతులకు గురి చేస్తుండడంతో స్థానికులు కర్రతో స్తంభం ఏర్పాటు చేసుకుని రక్షణ ఏర్పాట్లు చేసుకున్నారు. దీనిపై 'కర్ర'ంటు స్తంభం' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి విద్యుత శాఖాధికారులు స్పందించారు. వెంటనే కర్ర స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో కొత్త సిమెంటు స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ వైర్లు వేలాడకుండా తగిన చర్యలు తీసుకున్నారు.

తీర ప్రాంత రక్షణకు మా సహకారం ఉంటుంది

- నిధులు రాబట్టడానికి ఉప ముఖ్యమంత్రి పవన్ ప్రత్యేక దృష్టి పెట్టాలి
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్


గతంలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వివరాలు చూపిస్తున్న వంగా గీత

పిఠాపురం: జిల్లాలో తీర ప్రాంత రక్షణకు కాకినాడ ఎంపీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చర్యలు తీసుకుంటే అవసరమైతే దానికి మా సహకారం ఉంటుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్ తెలిపారు. శనివారం పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఆయన కృషితో ఉప్పాడ తీర ప్రాంత అభివృద్ధికి సముద్ర కోత నివారణకు నిర్మించిన జియోట్యూబ్ టెక్నాలజీ రక్షణ గోడ ఇప్పటి వరకు ఉప్పాడను రక్షించిందన్నారు. అయితే గత కొన్నేళ్లుగా సముద్ర అలల తీవ్రత బాగా పెరగడంతో జిల్లాలో ఉప్పాడ తీర ప్రాంతం తీవ్ర కోతకు గురవుతుందన్నారు. సముద్రంపై ఆధారపడి వేలాది మంది మత్స్యకారులు తీర ప్రాంతం వెంబడి జీవిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో తీర ప్రాంతంలో సముద్ర కెరటాల ఉధృతి విలువైన ప్రభుత్వ ఆస్తులు మత్స్యకారుల గృహాలు సముద్రంలో కలిసిపోతున్నాయన్నారు. వీటి నివారణకు 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తాను లోక్‌సభలో ఈ విషయంపై పలుమార్లు ప్రశ్నలు లేవనెత్తానని, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. ఆయన ఆదేశాలతో అప్పటి కేంద్ర మంత్రి ప్రకాశ్ జయ దేవకర్ దీనిపై స్పందించి నిపుణులను ఉప్పాడ పంపించారని వారు పరిశీలించి వెంటనే తీర ప్రాంత రక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. దీంతో అప్పట్లోనే కోత నివారణకు ప్రణాళికలు సిద్ధం చేశారని ఆమె తెలిపారు. అయితే నిధులు కేటాయింపు జరిగే లోపు ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ తాత్కాలికంగా ఆగిందన్నారు. ఎన్‌కోర్ ప్రాజెక్టును డిజాస్టర్ మేనేజ్‌మెంటు ప్రాజెక్టులో దీనిని పెట్టారన్నారు. అయితే ప్రస్తుతం రూ.418 కోట్ల ప్రాజెక్టు వచ్చినట్టుగా తెలిసిందని ఈ ప్రాజెక్టు తీసుకువచ్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అయితే మాకు ఉన్న సమాచారం ప్రకారం వచ్చిన ప్రాజెక్టులో రూ.318 కోట్లకు సంబంధించి ఉప్పాడ తీర ప్రాంతంతో పాటు పాయకరావుపేట, కోనసీమ జిల్లాలోను తీర ప్రాంత రక్షణకు ఇవే నిధులు కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలిసిందన్నారు. ఈ విషయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి పెట్టి వచ్చిన నిధుల్లో ఎక్కువ శాతం మన జిల్లాలో ప్రత్యేకంగా ఉప్పాడ తీర ప్రాంతంలో ఎస్‌పీజీఎల్ నుంచి మాయాపట్నం వరకు, కోనపాపపేటలోను సముద్ర కోత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పూర్తిగా కోత నివారణ చర్యలు తీసుకునేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం వ్యాపార పరంగాను, వాణిజ్య పరంగాను అభివృద్ధి సాధిస్తున్న తీరంలో ఇప్పటికే భారత్‌మాల పథకంలో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం కూడా జరుగుతున్నందున తీర ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు. పర్యావరణ మంత్రిగా ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టి భారీగా నిధులు తెచ్చే ప్రయత్నం చేయాలని ఆమె సూచించారు. తమిళనాడు ప్రభుత్వం ఒక విశ్రాంత డిజాస్టర్ మేనేజ్‌మెంటు అధికారితో ఒక కమిషన్ ఏర్పాటు చేసి ఆ రాష్ట్రంలో ఉన్న మొత్తం తీర ప్రాంతాన్ని రక్షించుకునేలా ప్రపంచ బ్యాంకు భాగస్వామ్యంతో సుమారు రూ.3వేల కోట్లతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విధంగా మన రాష్ట్రంలోను మొత్తం తీర ప్రాంతాన్ని రక్షించుకునేందుకు చర్యలు తీసుకోడానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు తీసుకున్న చర్యల్లో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి ఎంతో ఉందని, ఇటువంటి మంచి కార్యక్రమంలో తామంతా భాగస్వాములుగా ఉండడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వాలు మారినా వ్యవస్థలు వాటి పని అవి చేస్తుంటాయని దానిలో భాగంగానే ప్రస్తుతం తీర ప్రాంత రక్షణకు నిధులు విడుదల అయినట్లుగా ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి ఉలవల భూషనం, గండేపల్లి బాబీ, పిఠాపురం పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు రావుల మాదవ రావు, అడపా రఘు పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సమావేశాన్ని విజయవంతం చేయండి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్


సమావేశంలో మాట్లాడుతున్న వంగా గీతావిశ్వనాథ్

పిఠాపురం: కాకినాడలో సోమవారం నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ జిల్లా స్థాయి ఎస్సీ సెల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతావిశ్వనాథ్ పిలుపునిచ్చారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకుల సమావేశంలో ఆమె సమావేశం విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డీజే సుధాకర్‌బాబు సూచనలతో జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన కాకినాడ సూర్యకళామందిర్‌లో జిల్లా స్థాయి ఎస్సీ సెల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో ఎస్సీలకు జరుగుతున్న అన్యాయం, పథకాలు అందకపోవడం, ఇతర సమస్యలపైనా నాయకులు చర్చించి భవిష్యత్తు కార్యాచరణను నిర్దేశిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ, మండల, పట్టణ, మున్సిపాలిటీ, గ్రామ, వార్డు స్థాయి ఎస్సీ నాయకులు సభ్యులు, కార్యకర్తలు అందరు విధిగా హాజరై సమావేశానికి విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. పిఠాపురం నియోజవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెదపాటి రమేష్, ఉలవల భూషణం, వర్ధినిడి సుజాత, బత్తిన రాజశేఖర్, పెదపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొని వారి సూచనలు సలహాలు ఇచ్చారు. ఇప్పటి నుంచి నియోజకవర్గ, మండల, పట్టణ, మున్సిపాలిటీ, గ్రామ, వార్డు స్థాయిలో స్థానికంగా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు.

సముద్ర నాచు పెంపకం ఒక జీవనోపాధి

- మత్స్యకారులకు శిక్షణ
- అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీష్ అంజలి


శిక్షణలో మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీష్ అంజలి

కొత్తపల్లి: సముద్రపు నాచు పెంపకం ఒక జీవనోపాధి మార్గమని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీష్, ప్రిన్సిపాల్ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీష్ టెక్నాలజీ ఎస్.అంజలి అన్నారు. స్థానికంగా ఉన్న సురక్షా పేలస్‌లో శనివారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో గ్రీన్ క్లైమేట్ ఫండ్ సహకారంతో తొండంగి, కొత్తపల్లి మండలాలకు చెందిన మత్స్యకార మహిళలకు సముద్రపు నాగు పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్స్యకార మహిళలకు ప్రత్యామ్నాయ ఉపాధి భృతిని కల్పించుటకు, నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు తీరప్రాంతంలో వీటిని పెంచడంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2025 నాటికి 1.12 మిలియన్ల టన్నుల నాచును ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దీని పెంపకానికి రాయితీ పథకాలు ప్రకటించారని తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలో అమీనాబాదు, గొర్సపాలెం ప్రాంతాల్లో సముద్రపు నాచు పెంపకానికి అనువైన ప్రదేశాలుగా గుర్తించామని, ఈ శిక్షణ అనంతరం హాజరైన 60 మందికి కార్పొరేటివ్ సామాజిక భద్రత పథకం ద్వారా దివీస్ లేబరేటరీ నుంచి రూ.4.80 లక్షలు సహకారంతో రాఫ్టలను ఏర్పాటు చేసేందుకు, తయారైన నాచును ఆరబెట్టేందుకు సోలార్ డ్రయ్యర్లను అందిస్తారన్నారు. దీని ద్వారా నాణ్యమైన సముద్రపు నాచును ఉత్పత్తి చేసి మార్కెటింగ్ చేయడమే లక్ష్యమన్నారు. సముద్రపు నాచు మొక్కల పెంపకం ద్వారా ఒక్కొక్కరికీ రూ.10వేలు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లలో కేజీ రూ.20 నుంచి రూ.25 వరకూ ధర పలుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి మర్రెడ్డి శ్రీనివాస్, మత్స్యశాఖ సహాయ సంచాలకులు కరుణాకరరావు, లావణ్య, జీసీఎఫ్ జిల్లా కార్పొరేషన్ కో ఆర్డినేషన్ అసోసియేట్ హర్ష్, మత్స్యశాఖ అధికారులు రామకృష్ణ, ఉమా మహేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభుని ఆదాయం రూ.1.88 లక్షలు


భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.1,88,861 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. సుమారు పది వేల మంది భక్తులు స్వామిని దర్శించుకోగా 3500 మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రెండు బస్సుల ఢీ

- త్రుటిలో తప్పిన ప్రమాదం

సామర్లకోట: ముఖ్య కూడలి ప్రదేశాలల్లో పోలీసు కానిస్టేబుళ్లు లేక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలి ప్రదేశంలో శనివారం సాయంత్రం ఎదురు ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సులు ఢీ కున్నాయి. రెండు బస్సుల్లోను 40 నుంచి 50 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. అయితే ఇద్దరు డ్రైవర్లు వెంటనే అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. సామర్లకోట కాంప్లెక్స్ నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా ద్వారపూడి మీదుగా రాజమహేంద్రవరం వెళ్లడానికి ఫ్లైఓవర్ బ్రిడ్జి కాకినాడ-ద్వారపూడి వెళ్లు కూడలి వచ్చింది. అదే ప్రదేశంలో కాకినాడ నుంచి సామర్లకోట బస్సు కాంప్లెక్స్‌కు చేరుకోవడానికి ఎదురుగా బస్సు వచ్చింది. దాంతో రెండు బస్సులు ఢీకొనడం వెంటనే డ్రైవర్లు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. ఫ్లైఓవర్ బ్రిడ్జి కాకినాడ-కెనాల్ రోడ్డు మీదుగా ద్వారపూడి మార్గంలో వెళ్లు కూడలి ప్రదేశంలో పోలీసు సిబ్బంది లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వాహనాల ద్వారపూడి రోడ్డు మీదుగా కాకినాడ వెళ్లడానికి ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువ మార్గం మీదుగా వెళ్లవలసి ఉండగా బ్రిడ్జి మీదుగా వెళ్లడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇటు వంటి ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు జరుగకుండా ఉండడానికి ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలి ప్రదేశాలలో ఉదయం, సాయంత్రం సమయాల్లో సిబ్బందిని నియమించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే పోలీసు అధికారులు మాత్రం సిబ్బంది కొరత ఉందని చెప్పుతున్నారు.

మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

- ఏడో అదనపు జిల్లా జడ్జి చంద్రమౌళీశ్వరి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి చంద్రమౌళీశ్వరి

పెద్దాపురం: మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఎంతో అవసరమని పెద్దాపురం ఏడో అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి అన్నారు. స్థానిక మున్సిపల్ మెప్మా కార్యాలయంలో శనివారం మహిళా చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి చంద్రమౌళీశ్వరి మాట్లాడుతూ మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, ఇతర చట్టాలపై మహిళా సభ్యులందరికి కనీస అవగాహన ఉండాలన్నారు. ప్రస్తుతం మహిళలు అనేక రకాల ఇబ్బందులు, వేధింపులకు గురవుతున్నారని, వీటి నుంచి బయటపడేందుకు ప్రతి మహిళా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ సెంటర్‌లోని మెప్మా విభాగం వస్తూ విక్రమాల స్టాల్స్‌ను ఆమె ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, మేనేజర్ జ్యోతిరాణి, బార్ అసోషియేషన్ కార్యదర్శి ఎస్‌కే వల్లీబాబు, సీఐ విజయ్‌శంకర్, ఎస్ఐ మౌనిక, న్యాయవాదులు పాల్గొన్నారు.

మత్తు అలవాటు నివారణపై అవగాహన

కాకినాడ రూరల్: కాకినాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు మత్తుకు వ్యతిరేకంగా శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా వాకలపూడి ఇండస్ట్రియల్ పార్కులో యూనివర్సల్ బయో ఫ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కార్మికులకు మద్యం తాగుడు వలన కలిగే దుష్పరిమణాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఎం.కృష్ణకుమారి, నార్త్ స్టేషన్ సీఐ రామ్మోహనరావు, ఎస్సైలు వరహాలు, ఎండీ ఆలీ, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యబలిజ మహిళల ధర్నా

- తమపై తప్పుడు ఆరోపణలు చేసిన వారిని అరెస్టు చేయాలంటూ ధర్నా


పోలీసులకు వినతిపత్రం అందిస్తున్న సూర్యబలిజ సంఘం నాయకులు

పెద్దాపురం: తమ జాతిపై తప్పుడు ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారం మొదలుపెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పట్టణంలోని సూర్యబలిజ మహిళలు శనివారం సాయంత్రం ధర్నా చేశారు. స్థానిక మున్సిపల్ సెంటర్ పోలీస్ స్టేషన్ వద్ద సూర్య బలిజ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యబలిజ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గూడూరి మోహనరావు మాట్లాడుతూ పెద్దాపురం పట్టణంలో వ్యభిచారంపై వస్తున్న దుష్ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గత 30 ఏళ్ల కిందట వదిలేసిన వృత్తిని మా కులంపై దుష్ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. గత నాలుగు రోజులుగా సోషల్ మీడియాలో వచ్చిన వార్తలపై మా కులంపై జరుగుతున్న అసత్యాలను అడ్డుకట్ట వెయ్యాలన్నారు. ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెద్దాపురంలో వ్యభిచార వృత్తిపై యూట్యూబ్‌లో తులసీ చందు ఇచ్చిన కథనాలపై ఇన్వెస్టిగేషన్ చేసిన జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలన్నారు. కన్నెరికం, వేలం అనే పదాలు తమ చరిత్రలో లేవన్నారు. అనంతరం సీఐ విజయ్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు.